# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 305 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 2 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




### ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు

## మరింత ఆలస్యం

**పెద్దగా ప్రభావం ఉండేలా కనిపించని పరిస్థితి**

**వరి బదులు ఆరుతడి పంటలపై సిఎం రేవంత్ సూచనలు**

**హైదరాబాద్, జులై 1 (నమస్తే ఉదయం)**

నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, అందువల్ల రైతులు ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలని కోరారు. వరికి అసవరమైన నీరు లభించనప్పుడు, ఆరుతడి పంటలవైపు మళ్లాలలని అన్నారు. దీంతో రైతులు కూడా ఈదిశగా ఆలోచన చేయాల్సి ఉంది. అదేపనిగా వరి పండించడం వల్ల కూడా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ఈ అవకాశాన్ని ఆసారగా తీసుకుని మార్పుకోసం ప్రయత్నిస్తే మంచిదే. ఎందుకంటే వర్షాలు పడతాయో లేదో తెలియడం లేదు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో నారు వేసే పరిస్థితి లేదు. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సిఎం ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా ..మిగతా 2లో

### రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ

# సమీకరణపై సమీక్ష

**ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి**

**శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవాలి... అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**

**హైదరాబాద్, జులై 1 (నమస్తే ఉదయం)**

ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలని అన్నారు. హెచ్‌ఎండిఎ,టిజిఐఐసి, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు. బుధవారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బ్జడెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బ్జడెట్ కాదని.. వాస్తవికత



ఆధారంగానే బ్జడెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తెలంగాణను పదేపదే

## కించ పరుస్తున్న రేవంత్

- ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి
- కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా
- కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



2లో..

### రైతుల పేరుతో

## కొత్త డ్రామాలకు తెర

**వైఫల్యాలపై చర్చకు సిద్దంగా ఉన్నాం**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు సవాల్**

**హైదరాబాద్, జూలై1 (నమస్తే ఉదయం)**



శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ..మిగతా 2లో

## మెటాకు చుక్కెదురు..!

**వాట్సప్ యూజర్ నేమ్‌పై కేంద్రం సీరియస్**

**పరిశీలనలో మెటాకు నోటీసులు జారీ**


**వినియోగదారు, సెలబ్రిటీల భద్రతపై అధ్యయనం**

**ఆన్ నైన్ మోసాలు, భద్రతకు ముప్పుపై పరిశీలన**

**న్యూఢిల్లీ, జులై 1 (నమస్తే ఉదయం)**




వాట్సాప్ ప్రస్తుతం ఒక ప్రధాన ఫీచర్ కారణంగా వార్తల్లో ఉంది. అది 'వాట్సాప్ యూజర్‌నేమ్' అనే ఫీచర్‌పై తీసుకొస్తోంది. ఇది వినియోగదారుల మొబైల్ నంబర్లను పరిరక్షించడంలో సహాయపడుతుందని కంపెనీ ప్రకటించింది. అయితే, ప్రస్తుతానికి దీనిని సులభంగా అమలు చేయడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఫీచర్‌ను పర్యవేక్షిస్తోంది. వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠినంగా ఉంది. దానిపై ఒక విచారణ జరిపబోతోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, కేంద్ర ప్రభుత్వం వాట్సాప్ యూజర్‌నేమ్ సమస్యను అధ్యయనం ..మిగతా 2లో




## నయారా ఎనర్జీ ఊరట

**పెట్రో, డీజిల్ ధరల తగ్గింపు**

**పెట్రోల్ రూ.5, డీజిల్ పై రూ. 3 ఉపశమనం**

**దిగిరాని హెచ్ పీసీఎల్, బీపీసీఎల్, ఐఓఎల్**

**వాణిజ్య గ్యాస్ ధర కూడా తగ్గుదల**


**న్యూఢిల్లీ, జులై 1 (నమస్తే ఉదయం)**

దేశంలోనే అతిపెద్ద, ప్రముఖ ప్రైవేట్ చమురు సంస్థ నయారా ఎనర్జీ.. వాహనదారులకు భారీ ఉపశమనం కలిగించింది! అంతర్జాతీయంగా చమురు ధరలు దిగిరావడంతో.. నయారా ఎనర్జీ తన దేశవ్యాప్త నెట్‌వర్క్‌లో పెట్రోల్ ధరను లీటరుకు రూ. 5, అలాగే డీజిల్ ధరను లీటరుకు రూ. 3 మేర తగ్గించింది. పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గడంతో గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిటైల్ మార్కెట్లో ఇంధన ధరలను తగ్గించిన మొదటి సంస్థగా ..మిగతా 2లో

## చికెన్ @ రూ.300

**షాపుల్లో రూ. 330పైనే**

**అదే దారిలో ఎగ్ ధరలు**



**హైదరాబాద్, జులై 1 (నమస్తే ఉదయం)**

సామాన్యులకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, వర్షాభావ పరిస్థితుల వల్ల కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో రోజువారీ ఖర్చు పెరిగింది. ఈ క్రమంలో సామాన్యులకు అందుబాటులో ఉంటే చికెన్ ధరలు కూడా భారీగా పెరిగాయి. రెండు వారాల క్రితం కిలో చికెన్ రూ.250 వద్ద ఉండగా.. క్రమక్రమంగా పెరుగుతూ ఇప్పుడు ఏకంగా రూ.300 మార్క్ దాటింది. రిటైల్ షాపుల్లో కిలో రూ.300 నుంచి 330 మధ్య విక్రయిస్తున్నారు. దీంతో రెండు వారాల్లోనే రూ.50కి పైగా పెరుగుదల నమోదు చేసింది. దీంతో ముక్క లోపలికి వెళ్లాలంటే మాంసం ప్రియులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు పెరగడం, కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.

**రూ.300 దాటిన చికెన్ ధర**

హైదరాబాద్ జోన్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.301 వద్ద కొనసాగుతోండగా.. షాపుల్లో రూ.330 వరకు విక్రయిస్తున్నారు.ఇక డ్రెస్డ్ చికెన్ కిలో రూ.267గా పలుకుతోండగా.. ఫారం వద్ద లైవ్ బర్డ్ రూ.145గా ..మిగతా 2లో



### విజయ్ ప్రభుత్వాన్ని

## కూల్చే కుట్ర

**15 మంది టీవీకే ఎమ్మెల్యేల కొనుగోలుకు యత్నం**

**ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి ఇంటెలిజెన్స్**

**రూ. 35 కోట్ల ఆఫర్ చేసిన ఐపీడీఎస్ కన్సల్టెన్సీ**

2లో..

# తెలంగాణను పదేపదే కించ పరుస్తున్న రేవంత్

**ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి**
**కాళేశ్వరంపై ప్రపంచమంతా అభినందిస్తే...విమర్శలా**
**కోటి ఎకరాల మాగాణంగా కెసిఆర్ తీర్చిదిద్దారు**
**బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై మేం చర్చకు సిద్ధమే**
**తేదీ సమయం చెబితే రావడానికి రెడీగా ఉన్నాం**
**మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్**



**హైదరాబాద్, జులై 1 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటివరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ. 3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?అని సీఎం విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 2014-15లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. హైదరాబాద్‌ను చూసి న్యూయార్క్‌లా ఉందని రజనీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి ఫోన్ చేసి అభినందించారు. ఫాక్స్‌కాన్ ఛైర్మన్ కూడా గతంలో హైదరాబాద్‌పై ప్రశంసలు కురింపించారు. సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్య్రం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్‌కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు? సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్దాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్దాలు ఆడటం రేవంత్‌కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు. అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనా?ప్రెస్‌క్లబ్‌లోనా? జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా? ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2లక్షల ఉద్యోగాలు అని రాహుల్‌గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరొస్తారో, రాహుల్‌గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయటపెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా' అని రేవంత్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెర

మొదటి పేజీ తరువాయి...

ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బ్జడెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బ్జడెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా? అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు

కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీష్ రావు సవాల్ విసిరారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు మరింత ఆలస్యం

మొదటి పేజీ తరువాయి...

మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంగా కనిపిస్తోంది. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ



సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది.

# చికెన్ @ రూ.300

మొదటి పేజీ తరువాయి...

ఉంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.172గా ఉంది. ఇక కరీంనగర్ జోన్‌లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. అటు ఏపీలో చికెన్ ధరలు మరింత ఎక్కువ పలుకుతున్నాయి. విజయవాడ జోన్‌లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.306గా ఉండగా.. డ్రెస్డ్ చికెన్ రూ.271, రిటైల్ లైవ్ బర్డ్ రూ.175, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.149 వద్ద ఉన్నాయి.



### పెరిగిన గుడ్ల ధరలు

ఇక చికెన్‌తో పాటు కోడి గ్రుడ్ల ధరలు కూడా పెరిగాయి. విజయవాడలో12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.90గా ఉంది. ఇక హైదరాబాద్‌లో 12 కోడి గ్రుడ్ల ధర రూ.88 పలుకుతోంది. రిటైల్ షాపుల్లో ఒక్కో గుడ్డు రూ.10 వరకు పలుకుతోంది. కోళ్ల దాణా ఖర్చులు బాగా పెరిగిపోయాయి. దీంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ కారణంతో కోళ్ల ఉత్పత్తిని ఫామ్స్ యజమానులు భారీగా తగ్గించారు. డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నట్లు పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో చికెన్, కోడి గుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో కిలో చికెన్ రూ.400 వరకు చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అంటున్నారు.




# మెటాకు చుక్కెదురు..!

మొదటి పేజీ తరువాయి...

చేస్తుంది. అవసరమైతే, మెటాకు నోటీసు జారీ చేసే విషయాన్ని పరిశీలిస్తుంది. వాట్సాప్ యూజర్ ఐడీల వల్ల ఆన్‌లైన్ మోసాలు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఈ ఫీచర్‌కు సంబంధించిన భద్రత, గోప్యతా అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుంది.వాట్సాప్ ఈ సంవత్సరం జూన్ 29న తన యూజర్‌నేమ్ ఫీచర్‌ను ప్రకటించింది. కంపెనీ చెప్పిన దాని ప్రకారం, వినియోగదారులు ఇప్పుడు తమ ఫోన్‌లను సురక్షితంగా ఉంచుకోవడానికి యూజర్‌నేమ్‌ను ఎంచుకోవచ్చు. ఇప్పటికే ఈ ఫీచర్ కొందరు యూజర్‌లకు ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. కానీ ఈ ఫీచర్ సంవత్సరం చివరి నాటికి పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకురావాలని మెటా ఆలోచన చేస్తోంది. ఈ ఫీచర్ భద్రత, ప్రైవసీకి మరో రక్షణ లేయర్‌గా కంపెనీ భావిస్తోంది. మెసేజ్ పంపాలనుకునే ఎవరైనా వారి యూజర్‌నేమ్ స్పెల్లింగ్‌ను తెలుసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులు ఒక ప్రత్యేకమైన పేరును ఎంచుకోవాల్సి ఉంటుందని వాట్సాప్ తన బ్లాగ్‌లో పేర్కొంది. కావాలనుకుంటే, వారు యూజర్‌నేమ్ జనరేటర్ ఫీచర్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ఫీచర్ క్రియేటర్లు ,వ్యాపార సంస్థలు తమ ఆన్‌లైన్ ఇమేజ్‌ను బలోపేతం చేసుకోవడానికి సహాయపడుతుంది. వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లడం ద్వారా ఈ ఫీచర్‌ను పొందవచ్చు. సెట్టింగ్స్‌లోకి వెళ్ళాక, అకౌంట్‌పై క్లిక్ చేసి, అక్కడ మీ యూజర్‌నేమ్‌ను నమోదు చేసుకోండి. ఇలాంటి యూజర్ నేమ్ ఫీచర్‌ను ఇప్పటికే టెలిగ్రామ్‌లో అందుబాటులో ఉంది. ఆ యూజర్ నేమ్ ఫీచ్ కారణంగా టెలిగ్రామ్‌లో చాలా మోసాలు జరుగుతున్నాయనే ఆందోళన బలంగా ఉంది. యూజర్ నేమ్‌తో సులభంగా మోసాలు చేసే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

# నయారా ఎనర్జీ ఊరట

మొదటి పేజీ తరువాయి...

నయారా ఎనర్జీ నిలిచింది. అయితే, ట్యాక్స్‌లు, వ్యాట్‌ల కారణంగా వివిధ రాష్ట్రాల్లోని నయారా పెట్రోల్ బంకుల వద్ద ఇంధన ధరలు వేరువేరుగా ఉంటాయి. గతంలో అమెరికా-ఇరాన్ యుద్ధం తీవ్రస్థాయికి చేరి అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు.. దేశంలో అందరికంటే ముందుగా ఇంధన ధరలను పెంచిన రికార్డు కూడా నయారా ఎనర్జీ పేరిటే ఉంది. లీటరు పెట్రోల్‌పై రూ. 5.30, లీటరు డీజిల్‌పై రూ. 3 ప్రైజ్ హైక్ చేసింది. అయితే, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ముడి చమురు ధరల తగ్గుదల ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేయడంలోనూ ఈ సంస్థే ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో రిటైల్ బంకులను నిర్వహిస్తున్న నయారా ఎనర్జీ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రైవేట్ బంకులను ఆశ్రయించే వాహనదారులకు, ముఖ్యంగా రవాణా రంగానికి పెద్ద ఊరట లభించనుంది. ప్రస్తుతం ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ధరల తగ్గింపుపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ.. ప్రైవేట్ రంగంలో వచ్చిన ఈ మార్పుతో రాబోయే రోజుల్లో ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఇంధన ధరలను తగ్గించే దిశగా అడుగులు వేసే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. గుజరాత్ వాద్‌నగర్‌లో నయారా ఎనర్జీ ప్రతియేటా 20 మిలియన్ టన్నుల రిఫైనరీని నడుపుతోంది. ఇది దేశంలోనే అతిపెద్ద నెంబర్.

### వాణిజ్య గ్యాస్ ధర తగ్గింపు

భగ్గుమంటున్న నిత్యావసర ధరలతో అల్లాడిపోతున్న సామాన్యుడికి గుడ్ న్యూస్! కీలకమైన ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గిస్తున్నట్టు చమురు మార్కెటింగ్ సంస్థ ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 183.50 తగ్గింది. ఈ ధర తగ్గింపు జులై 1, అంటే నేటి నుంచే అమల్లోకి వచ్చింది. తాజా ధర తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 2,930కి చేరింది. కాగా ఇళ్లల్లో వినియోగించే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర మాత్రం మారలేదు. ఢిల్లీలో దీని ధర రూ. 942గా ఉంది.



# విజయ్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

**న్యూఢిల్లీ, జులై 1 (నమస్తే ఉదయం)**

తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలతో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తమిళనాడు ఇంటెలిజెన్స్ అధికారులు ఈ కుట్రపై దర్యాప్తు చేపట్టారు.

టీవీకే పార్టీ ఎమ్మెల్యే ఎన్ ఇళయరాజా కొద్దిరోజుల క్రితం చెన్నై పోలీసులను ఆశ్రయించారు. చెన్నైకి చెందిన ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో.. 'తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టమని ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్‌కు చెందిన వ్యక్తి నాతో చెప్పాడు. అలా చేస్తే 35 కోట్ల రూపాయలు ఇస్తానన్నాడు. ఈ ఆఫర్ గురించి ఎవరితోనూ మాట్లాడవద్దని చెప్పాడు' అని పేర్కొన్నాడు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు ఐపీడీఎస్ కన్సల్టెన్సీ ఫామ్ ఉద్యోగిని అరెస్ట్ చేశారు. అతడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి అత్యంత సన్నిహితుడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక, ఈ వ్యవహారంపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ స్పందించారు. సెంథిల్ బాలాజీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. 'సెంథిల్ బాలాజీతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులు ఈ వ్యవహారంలో నేరుగా పాలుపంచుకున్నారు. వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కుట్రలో భాగం అయిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేయాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ముగింపు పలకాలి' అని అన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా/అవగాహన సమావేశం

**రాజేంద్రనగర్, జూలై 1 (నమస్తే ఉదయం) :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (సర్)లో రాజకీయ పార్టీల తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లుగా నియమితులైన వారు బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలసి సమన్వయంగా ముందుకు సాగేటట్లు రాజకీయ పార్టీల నాయకులు సూచనలు చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అథారిటీ (ఈ ఆర్ ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం లో 44% మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి నగరంలోనే రాజేంద్రనగర్ నియోజకవర్గం సర్ కార్యక్రమంలో మొదటి స్థానంలో నిలిచిందని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు . నియోజకవర్గంలో ఆరు లక్షల 35 వేల పైచిలుకు ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు రెండు లక్షల 70వేల పైచిలుకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయడం జరిగిందన్నారు . రాజకీయ పార్టీల తరఫున నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు కొన్ని చెట్ల బీఎల్ఓ లకు సహకరిస్తున్నారని, మిగతా చోట్ల వారు పట్టించుకోవడంలేదని వాదన లు వినిపిస్తున్నాయన్నారు. అలా కాకుండా ప్రతి బూత్ లో బూత్ లెవెల్ ఏజెంట్లు బూతు లెవల్ ఆఫీసర్లకు సహకరించి ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వారు పూర్తి చేసి తిరిగి ఇచ్చేవరకు కలసి పనిచేయాలన్నారు.

**ప్రతి బూత్ లో ఓటర్ల వివరాలు ఖచ్చితంగా తెలుసుకోవాలి :**

ప్రతి బూత్ లో మరణించిన ఓట్ల వివరాలు, ఇండ్లు షిఫ్ట్ చేసిన వారి వివరాలు తెలుసుకొని వారి ఇక్కడ లేరనే నిర్ధారణ అయ్యాక బీ ఎల్ ఓ లు, బీ ఎల్ ఏ లు సంతకాలు చేసి ఇవ్వడం ద్వారా లేని ఓట్ల ను గుర్తించడం జరుగుతుందన్నారు. అలా చేయడం ద్వారా ఏలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు.

**పోటో లు పెట్టి తిరిగి ఇవ్వాలి:**

ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకున్న ఓటర్లు 2002 లో ఎక్కడ ఓటు వేశారు... వారి ఓటరు కార్డు నెంబరు, ఆధార్ కార్డు నెంబరు రాసి పోటో అతికించి తిరిగి బీ ఎల్ ఓ లకు ఇవ్వాలన్నారు. వీటన్నిటి విషయంలో రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. సమీక్ష సమావేశం లో ఏ ఈ ఆర్ ఓ లు మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, రాములు లతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




సర్ పై జరిగిన సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఈ ఆర్ ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఏ ఈ ఆర్ ఓ లు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు



సిటిజన్ హాస్పిటల్ అంకాలజీ విభాగం అధిపతి ఏవీఎస్ సురేష్ కి బీసీ రాయ్ అవార్డును అందిస్తున్న నిర్వాహకులు...

# తెల్లకోటు వెనుక నిలిచే దేవుళ్లకు వందనం..

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**శేరిలింగంపల్లి : జూలై 1, (నమస్తే ఉదయం)**

సమాజంలో రోగి కళ్లల్లో ఆనందాన్ని చూడటమే వైద్యుడు పొందే అతిపెద్ద పురస్కారమని, నేటి యువ వైద్యులు భారతరత్న డాక్టర్ బి.సి. రాయ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి మెరుగైన సేవలు అందించాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ డాక్టర్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని జాకీర్ హుసేన్ కాన్ఫరెన్స్ హాలులో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న 35 మంది ఉత్తమ వైద్యులకు 'భారతరత్న డాక్టర్ బి.సి. రాయ్ పురస్కారాలను' అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హెచ్‌సీయూ ఉపకులపతి ఆచార్య జొన్నలగడ్డ అనూరాధ, సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజీ అండ్ హెమటాలజీ డాక్టర్ ఎ.వి.ఎస్. సురేష్‌లు డాక్టర్ బి.సి. రాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లండన్‌లో కేవలం రెండున్నర ఏళ్లలోనే ఎంఆర్ సి పి, ఎఫ్ఆర్సీఎస్ పూర్తి చేసిన అసాధారణ ప్రతిభావంతుడు బి.సి. రాయ్ అని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రిగా కలకత్తా మేయర్‌గా ఉపకులపతిగా ఉన్నత పదవులు బాధ్యతలు నిర్వహిస్తూనే ఆయన చివరి శ్వాస వరకు రోగులకు వైద్య సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు. ఆయన చేసిన నిరుపమాన సేవలకు గుర్తుగానే కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' పురస్కారంతో సత్కరించి, ఆయన జన్మదినాన్ని జాతీయ వైద్యుల దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఈ ఏడాది వైద్యుల దినోత్సవాన్ని "మాస్క్ వెనుక వైద్యులను ఎవరు స్వస్థ పరుస్తారు" అనే వినూత్న నినాదంతో నిర్వహిస్తున్నట్లు వక్తలు తెలిపారు. అహోరాత్రులు శ్రమిస్తూ సమాజ శ్రేయస్సు కోసం నిలబడే వైద్యుల త్యాగాలను గుర్తించి వారికి కృతజ్ఞత చెప్పడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు. మనదేశంలో వైద్యుడిని 'వైద్యో నారాయణో హరిః' అంటూ దేవుడితో సమానంగా పూజిస్తారని గుర్తుచేశారు.

**కనుమరుగవుతున్న జనరల్ ఫిజీషియన్లు.. పెరిగిన వైద్య ఖర్చులు**

ప్రస్తుత వైద్య రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆధునిక ఆరోగ్య సంరక్షణ ఒక లాభసాటి వ్యాపారంగా మారిందని వైద్య ఖర్చులు పేద మధ్యతరగతి వర్గాలకు భారం అవుతున్నాయని పేర్కొన్నారు. మన దేశంలో డాక్టర్ పేషెంట్ నిష్పత్తి 1:834 గా ఉన్నప్పటికీ, రోగులకు మొదటి వరుస రక్షణగా నిలిచే 'జనరల్ ఫిజీషియన్ల' కొరత తీవ్రంగా ఉందన్నారు. ఫలితంగా చిన్న చిన్న వ్యాధులకు కూడా స్పెషలిస్టులను సంప్రదించాల్సి వస్తోందని దీనివల్ల ఖర్చులు పెరగడమే కాకుండా సకాలంలో వైద్యం అందక సామాన్య వ్యాధులు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా జనరల్ ఫిజీషియన్ల సంఖ్యను పెంచే చర్యలు చేపట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూ హెచ్ ఓ ) మరిన్ని పరిశోధనలు చేసి సామాన్యులకు వైద్యం అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో వృద్ధాప్య మనోవైద్య రంగాలతో పాటు కార్డియాలజీ, ఆంకాలజీ, మధుమేహం వంటి విభాగాల్లో వైద్యులకు డిమాండ్ పెరగనుందని సూచించారు.

**35 మంది వైద్యులకు ఘన సత్కారం**

మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో నిరుపేదలకు ఉత్తమ సేవలు అందిస్తున్న 35 మంది డాక్టర్లను గుర్తించి వారికి 'డాక్టర్ బి.సి. రాయ్ పురస్కారం' జ్ఞాపిక, పగిడిలతో ఘనంగా సత్కరించారు. అపోలో హాస్పిటల్ ఆర్థో సర్జన్ డాక్టర్ దీప్తీనందన్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్, హైదరాబాద్ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ రవీంద్ర కుమార్, అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, జనార్ధన్, వాణీ సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, సీతా కుమారి, విజయలక్ష్మి, శ్రీమతి జ్యోతి, మిరియాల ప్రీతమ్, సిహెచ్. వెంకటేశ్వరరావు, బాలన్న, సత్యనారాయణ తోపాటు హెచ్‌సీయూ హెల్త్ సెంటర్ సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికపై అత్యాచారం: ఆటో డ్రైవర్‌కు 20 ఏళ్ల జైలుశిక్ష 1 లక్ష పరిహారం!

**శేరిలింగంపల్లి : జూలై 1, (నమస్తే ఉదయం)**



బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు అఫ్రోజ్..

పెళ్లి పేరుతో మైనర్ బాలికను నమ్మించి, అపహరించి పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడికి కోర్టు ఘోర శిక్ష విధించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు రూ. 3,000 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి టి. శ్రీనివాస్ సంచలన తీర్పునిచ్చారు. అలాగే, బాధితురాలికి రూ. 1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

**అసలేం జరిగిందంటే..?**

పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్ (23) అనే యువకుడు లింగంపల్లిలో ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలికతో అతనికి పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2020 మార్చి 15న ఆమె తల్లి డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంట్లో నుండి తీసుకెళ్లిపోయాడు.

కూతురు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లి చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మార్చి 16న చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**బయటపడ్డ ఘోరం.. పోక్సో చట్టం కింద కేసు:**

దర్యాప్తులో భాగంగా నిందితుడు మహ్మద్ అఫ్రోజ్ బాలికను లోబరుచుకుని పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా కేసులో పోక్సో యాక్ట్ 2012 సెక్షన్ 5 రెడ్ విత్ 6 సెక్షన్లను జోడించారు.

2020 జూలై 10న నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, పూర్తి స్థాయిలో విచారణ జరిపి కోర్టులో పక్కా ఆధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**కోర్టు సంచలన తీర్పు**

పూర్తిస్థాయి విచారణ తోపాటు సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక న్యాయమూర్తి టి. శ్రీనివాస్ నిందితుడిపై మోపబడిన నేరాలు రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.నేరగాళ్లకు ఇలాంటి కఠిన శిక్షలు పడటం వల్ల సమాజంలో మార్పు వస్తుందని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు సైబరాబాద్ పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి సందర్భంగా మీడియాకు తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలి

## ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో పాల్గొన్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్

**కూకట్ పల్లి, జులై 1 (నమస్తే ఉదయం)**



ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలో ఆర్ పి కాలనీ జరుగుతున్న ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసుదేవ్ బి ఎల్ ఓ శైలజ తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నుండి ఫారం-6 స్వీకరించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని బి ఎల్ ఓ కి సూచించారు. అనంతరం వరికుప్పల వాసుదేవ్ మాట్లాడుతూ18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం అని అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని, ఎస్ ఆర్ ఐ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు. అడ్రస్ మార్పు, కరెక్షన్ల కోసం ప్రజలు ఫారం-6, 7, 8 లను తమకు అందజేయవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని, ఈ బాధ్యతను ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్తగా ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.



# సర్వీస్ పెన్షన్ మాత్రమే అంతిమ లక్ష్యం"

## సీపీయస్ (జూూ) రద్దుకై జూలైలో 'జన జాగరణ యాత్ర'.

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(నమస్తే ఉదయం):"**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని (ఊూ) పునరుద్ధరించడమే అంతిమ లక్ష్యంగా పోరాడుతాం" అని టిఎస్ సీపీయస్ ఎంప్లాయిస్ యూనియన్ స్పష్టం చేసింది. బుధవారం గద్వాలలో టీఎన్జీవో భవన్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ హక్కుల సాధన కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీపీయస్ రద్దును కాంక్షిస్తూ జూలై నెలలో జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే "జనజాగరణ యాత్ర"ను విజయవంతం చేయడం కోసం ప్రతి మండలంలో ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చన్న, రాష్ట్ర సహాధ్యక్షులు విష్ణు, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు ప్రతాప్ రెడ్డి, ఎల్లస్వామి, పాల్వాయి లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు పరశురాముడు, పుట్ట నాగరాజు, టెక్నికల్ టీం మెంబెర్ ఆంజనేయులు, సాహిత్య కమిటీ మెంబెర్ జయన్న, బి. సునీల్, ఎస్. రవి, మురళీధర్ రెడ్డి, మేడికొండ ఈశ్వర్, ఏజీ సతీష్ కుమార్ రెడ్డి, హేమంతరావు, దిగేందర్ రెడ్డి, ఎస్. తిమ్మన్న, రవి కుమార్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రవి ప్రకాష్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్ర శేఖర్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.




# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత పునరుద్ధరించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(నమస్తే ఉదయం)::**

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను కుదించడం పూర్తిగా ప్రభుత్వ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ జిల్లా యువ నాయకులు గంజిపేట రాజు మండిపడ్డారు. ఆర్ఎస్పీ కి తక్షణమే సెక్యూరిటీని పునరుద్ధరించాలని, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు కూడా రక్షణ లేకుండా పోతోందని, తమకు కూడా భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తున్నందుకే రాజకీయ కక్షతో సిఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఈ చర్యకు పాల్పడిందన్నారు. ఎలాంటి అధికారిక హోదా లేని సీఎం సోదరులకు భారీగా ప్రొటోకాల్ భద్రత కల్పిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం, దశాబ్దాల పాటు దేశానికి సేవలందించి ప్రస్తుతం ప్రాణహాని ఎదుర్కొంటున్న మాజీ అధికారి ఆర్ఎస్పీ కి భద్రత తగ్గించడం దుర్మార్గమన్నారు. ఏ ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా భద్రత తొలగించారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రఫీ, గోపాల్ రెడ్డి, గాజుల కృష్ణ రెడ్డి, టీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు మాజ్, గద్వాల్ టౌన్ అధ్యక్షులు కోళ్ళ తరుణ్, ప్రధాన కార్యదర్శి నవీద్, మన్యం, అజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య సెంట్రల్ కిచెన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు!

## వంటగదిలో పిల్లి విసర్జన.. వీధి కుక్కల సంచారం

## నిబంధనలు గాలికొదిలేసిన యాజమాన్యం;

## హైజీన్ రేటింగ్‌లో కేవలం 67 శాతం మార్కులే..

**శేరిలింగంపల్లి : జూలై 1, ( నమస్తే ఉదయం)**



కిచెన్ లో అపరిశుభ్రతగా ఉన్న కూరగాయలు..

విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంలో ప్రముఖ విద్యాసంస్థల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మాదాపూర్‌లోని శ్రీ వశిష్ఠ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజీల సెంట్రల్ కిచెన్) లో తీవ్ర అపరిశుభ్రత వాతావరణం వెలుగుచూసింది. వంటశాల పరిసరాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండం తోపాటు స్టోర్‌రూమ్‌లో పిల్లి విసర్జన కనిపించడం వంటి అంశాలపై అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**కొన్ని మంచి పద్ధతులు ఉన్నప్పటికీ.. లోపాలే ఎక్కువ!**

ఈ తనిఖీల్లో ఆహారాన్ని తయారు చేసే సిబ్బంది హెయిర్‌నెట్లు ధరించడం, ముడి పదార్థాలను ప్యాలెట్లపై తగినంత ఖాళీతో నిల్వ చేయడం, వండిన ఆహారాన్ని మూతపెట్టి ఉంచడం వంటి కొన్ని మంచి పద్ధతులను అధికారులు గుర్తించారు. అయితే, వీటి కంటే విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలిగించే లోపాలే ఎక్కువగా బయటపడటం ఆందోళన కలిగిస్తోందని అధికారులు తెలిపారు. వంటశాల ప్రవేశం వద్ద వీధి కుక్కలు తిరుగుతుండటం స్టోర్‌రూమ్‌లో పిల్లి విసర్జన లభ్యం కావడం అధికారులను విస్మయానికి గురిచేసింది. వంటశాల ప్రవేశ ద్వారం వద్ద నేల దెబ్బతిని నీరు నిల్వ చేరింది. కిటికీలు తెరిచి ఉంచడం, కనీసం ఫ్లై ట్రాప్స్ ఏర్పాటు చేయకపోవడంతో ఈగల బెడద విపరీతంగా ఉంది. బంగాళాదుం తొక్కలు తీసే యంత్రం తీవ్ర అపరిశుభ్రంగా ఉందన్నారు.

ఆహార అవశేషాలతో కూడిన చెత్త బుట్టలను మూతల్లేకుండా తెరిచి ఉంచారు. కూరగాయల సార్టింగ్, గ్రేడింగ్ సరిగ్గా చేయలేదు. ఆహార సిబ్బందికి సంబంధించిన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు ముగిసింది. అలాగే పెస్ట్ కంట్రోల్, నీటి పరీక్షల రికార్డులను యాజమాన్యం అధికారులకు చూపించలేకపోయింది.

**ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ..**

సెంట్రల్ కిచెన్‌కు అధికారులు 108 మార్కులకు గాను కేవలం 72 మార్కులు 67 శాతం మాత్రమే కేటాయించారు. ఈ నేపథ్యంలో కిచెన్ యాజమాన్యానికి అధికారులు వెంటనే ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేశారు. గుర్తించిన లోపాలన్నింటినీ తక్షణమే సరిదిద్ది, నివేదిక సమర్పించాలని, లేనిచో చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని సైబరాబాద్ ఫుడ్ సేఫ్టీ బృందాలు హెచ్చరించాయి.

# రెండు నెలల్లో ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ పూర్తి కావాలి

**ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యతనిస్తోంది.**

**సర్వే, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.**

**సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు**





**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(నమస్తే ఉదయం):**

ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంను పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ దిశగా అధికారులు రెండు నెలల్లో ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ప్రైమరీ డిక్లరేషన్ పూర్తయి అవార్డు స్థాయిలో ఉన్న భూముల వివరాలను అడిగారు. అనంతరం వివిధ మండలాల వారీగా ఆయా గ్రామాల పరిధిలో చేయాల్సిన భూ సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలల్లో ప్రాజెక్టుకు అవసరమైన పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాలని ఆదేశించినందున అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూ సేకరణ పై ప్రతి వారం సమీక్ష సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తామని, అధికారులు ఎప్పటికప్పుడు పురోగతి సాధిస్తూ కావాల్సిన భూసేకరణ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా చేరుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకుని భూసేకరణ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి రోజువారి లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పనిచేయాలన్నారు. భూ సేకరణ వేగవంతం కావడానికి అవసరమైతే అదనపు సర్వేయర్లను నియమిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## చిన్న పోతులపాడు శివారులో పేకాట తావులపై పోలీసుల దాడి

**ఏడుగురి అరెస్ట్, నగదు మరియు వాహనాలు స్వాధీనం.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1 (నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా మనోపాడ్ మండల పరిధిలోని చిన్న పోతులపాడు గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో ఎస్ఐ స్వాతీ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు (7) వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 4,280/- 4 ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

"గ్రామ పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవు. పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నాం."

--- స్వాతి, సబ్ ఇన్‌స్పెక్టర్ (రా×), మనోపాడ్ పోలీస్ స్టేషన్.



## వైద్యులు దేవునితో సమానం...
# వైద్యుల సేవలు వెలకట్టలేనివి

**మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్**

**కూకట్ పల్లి, జూలై 1 (నమస్తే ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ లో మూసా పేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూసాపేట లోని పలువురు వైద్యులను ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిపించే దేవుళ్ళు వైద్యులు అని, వారిని గౌరవించుకోవాలని అన్నారు. వైద్యుల సేవలు వెలకట్టలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచశీల స్కూల్ కోరస్పాండంట్ డి. శ్రీనివాస్, డాక్టర్లు జీ. ఈశ్వర్, కిషోర్, వేణుగోపాల్, తిరుపతి, గిరిప్రసాద్, డిలిశ్వర్ రావు, ధనుజయ, కృష్ణ, డీ. ఈశ్వర్, రాంబాబు, జ్యోతి మెడికల్ శ్రీనివాస్, మానస ల్యాబ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## జలమండలి అధికారులకు అభినందనలు వెల్లువ

**శేరిలింగంపల్లి : జూలై1(నమస్తే ఉదయం)**

ప్రజాసేవలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి సత్ఫలితాలు వస్తాయో జలమండలి అధికారులు నిరూపించారు. డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, రాజీవ్ నగర్, సిద్ధిఖీ నగర్, పీజేఆర్ నగర్ కాలనీలలో ఈ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించినందుకు, అలాగే డ్రైనేజీ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించినందుకు జలమండలి అధికారులకు స్థానిక ప్రజలు, నాయకులు అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ కి కాలనీ వాసుల అభినందన, కృతజ్ఞతలు తృాలిపారు. ఈ సందర్భంగా అంజయ్య నగర్ డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ సాధారణంగా వేసవి కాలం వస్తే చాలు శివారు కాలనీల్లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం చూస్తుంటామని, కానీ ఈ ఏడాది కాలనీల ప్రజల అవసరాలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వారు స్పందించిన తీరు అభినందనీయమని కొనియాడారు. ముందస్తు ప్రణాళికతో, తగిన చర్యలు తీసుకోవడం వల్లనే నేడు ఈ నాలుగు కాలనీల్లో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు గొప్ప ఉపశమనం లభించిందన్నారు. పరిశుభ్రత, ప్రజారోగ్యానికి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండటం ఎంతో కీలకమని, కాలనీల్లో ఎక్కడ డ్రైనేజీ సమస్య తలెత్తినా ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి డ్రైనేజీ ట్యాంకర్లను మరియు సిబ్బందిని పంపించి సమస్యలను పరిష్కరించారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా, రద్దీగా ఉండే కాలనీల రోడ్లపై ప్రమాదకరంగా మారిన తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి, అవసరమైన ప్రతి చోటా తక్షణమే కొత్త మ్యాన్‌హోల్ మూతలను ఏర్పాటు చేయించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో అధికారులు చూపిన చొరవ నిజంగా ప్రశంసనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జలమండలి అధికారులుగా వారు ప్రదర్శించిన వృత్తిపరమైన నిబద్ధత మరియు సేవా నిరతి ఇతర శాఖలకు కూడా ఆదర్శప్రాయమని, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఇదే విధంగా త్వరితగతిన స్పందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అంజయ్య నగర్ డివిజన్ ప్రతినిధులు సంతోష్, రామకృష్ణ సాగర్, శివ రాజ్ సాగర్ లతో పాటు అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.



## ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలి

**ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, జులై 1 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయి నగర్ కాలనీలో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని, నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, రాజేష్ చంద్ర, పోశెట్టిగౌడ్, నవీన్ రెడ్డి, శ్రీధర్, తోట ప్రవీణ్, త్రినాథ్, సురభి రమేష్ రావు, సంతోష్ బిరాదర్, శేఖర్, రామరాజు, కృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




## ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు పెరుగుతాయి

**పాపి రెడ్డి నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి**

**కూకట్ పల్లి, జూలై 1 (మెట్రో ఉదయం)**

ఇంకుడుగుంతల ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని పాపిరెడ్డినగర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని రెయిన్బో పాఠశాలలో పాఠశాల కరెస్పాండంట్ విష్ణువర్ధన్ రెడ్డి ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలను, ఏబీ ఐ డిజిటల్ స్క్రీన్ ను చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు ఆర్ భగవంత రెడ్డి, ఏ ప్రభాకర్ రెడ్డి, కనక రెడ్డి, డి తిరుపతిరెడ్డి, పండు గౌడ్, జీ వసంత రెడ్డి, గోపాల్, హెచ్ రాజ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ తోపాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎన్నుమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు

**పత్రాలను పూరించేందుకు బిఎల్ఎలు, వాలంటీర్లు సహకరించాలి.**


**విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1(నమస్తే ఉదయం)**

అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నుమరేషన్ పత్రాలను పూరించి ఇస్తేనే ఎలక్ట్రోరోల్లో ఓటరుగా నమోదు కాబడతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం గద్వాల మండలంలోని తుర్కోనిపల్లి గ్రామం, పోలింగ్ స్టేషన్ 272 పరిధిలో బూత్ లెవెల్ అధికారులు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా మొదట నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇండ్లకు వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ఓటర్లు ఎన్నుమరేషన్ పత్రాలను పూరించేందుకు బిఎల్ఎలు, వాలంటీర్లు సహకరించాలని కోరారు. పలువురికి కలెక్టర్ ఎన్నిమరేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనము, రాత, పాఠ్య పుస్తకాల పంపిణీ, తదితర అంశాలపై మాట్లాడారు. పలువురు విద్యార్థులతో బోర్డుపై పాఠ్యాంశాలను రాయించి వారి అభ్యసన సామర్థ్యంను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ పర్యటనలో గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, సూపర్వైజర్ శ్రీనివాసులు, బిఎల్ఓ లక్ష్మి, జిపిఓ ఆనంద్, బీఎల్ఏ లు, తదితరులు పాల్గొన్నారు.





## వరద ప్రవాహం లేక కళ తప్పిన నిజాం కొండ ఖిల్లా

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 1 (నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి సమీపంలో, జాతీయ రహదారి పక్కనే కృష్ణా నది మధ్యలో వెలిసిన చారిత్రాత్మక 'నిజాం కొండ ఖిల్లా' ప్రస్తుతం ఎగువ నుండి ఆశించిన స్థాయిలో వరద ప్రవాహం లేకపోవడంతో పూర్తిగా కళ తప్పింది. సాధారణంగా ముంచెత్తే వర్షాలు, ఎగువ ప్రాజెక్టుల నుండి వచ్చే భారీ వరద నీటితో కృష్ణా నది నిండుగా ప్రవహిస్తున్నప్పుడు, ఈ ఖిల్లా చుట్టూ నీరు చేరి దట్టమైన పచ్చదనంతో ఒక అద్భుతమైన ద్వీపంలా మెరిసిపోయేది. కానీ, ప్రస్తుత సీజన్‌లో సరైన వరద ప్రవాహం రాకపోవడంతో నది గర్భం పూర్తిగా ఎండిపోయి, మైదానాన్ని తలపిస్తోంది. చుట్టూ నీరు లేకపోవడంతో ఆ పచ్చని కొండ, దానిపై ఉన్న పురాతన కోట గోడలు బోసిపోయి, వెలవెలబోతూ కనిపిస్తున్నాయి.

**ప్రయాణికులకు తప్పని నిరాశ:**

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు, బీచుపల్లి క్షేత్రానికి వచ్చే భక్తులు నది మధ్యలో జలకళతో ఉట్టిపడే ఈ సుందర దృశ్యాన్ని చూడటానికి ఆసక్తి చూపిస్తుంటారు. అయితే, ఇప్పుడు ఎడారిలా మారిన నదిని, కళ తప్పిన కొండను చూసి పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. ఎగువ నుండి వరద నీరు వచ్చి నది మునుపటిలా ప్రవహిస్తే తప్ప ఈ నిజాం కొండ ఖిల్లాకు ఆ పాత జలకళ వచ్చేలా లేదు.





## ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ నమోదు చేసుకోవాలి

**బిజెపి మహిళా మోర్చా నాయకురాలు వనిత రెడ్డి**

**రాజేంద్రనగర్, జూలై 1(నమస్తే ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 (ఎస్ఐర్)కీలకమైన భాగం ఎన్యూమ రేషన్ (గణన) ఫారం పూరించాలని బిజెపి మహిళా మోర్చా నాయకురాలు మేకల వనితారెడ్డి కోరారు. బుధవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్గూడా డివిజన్ లో గల మారుతి ఎంక్లేవ్ కాలనీలో బిఎల్ఓ రాజుతో కలిసి వనిత రెడ్డి ఎన్యుమరేషన్ ఫార్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనితారెడ్డి మాట్లాడుతూ... ఓటర్ కార్డులో స్పష్టమైన తమ వివరాలను ఎస్ఐఆర్ పత్రంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం అధికారులు ఆ ఫారాలను అంజేస్తుండగా అందులో ఏయే అంశాలు నింపాలి, ఏయే పత్రాలు జత చేయాలి లాంటి అంశాలపై అవగాహన కల్పించారు.